యాతిబాధ:

# స్వాంతబాజా

పగడాల
హరిప్రసాదరావు

నేనొక పెద్ద కవిని. కవినే కాదు ఉత్తమ కథకుణ్ణీ గాయకుణ్ణీ చిత్రకారుణ్ణీకూడా! కాని, కామ్రేడ్ కవిని మాత్రం కాదు. నాలో యిన్ని కళలున్నాయి గనుకనే నా ఊహాసౌధాల శిఖరాలు గగనాన్ని చుంబించ ప్రయత్నిస్తాయి. నేను వ్రాసిన రచనలకు లెక్కేలేదు. ఇప్పుడున్న కవులందరిమీదా సవాల్ చేస్తాను...లెక్కించుకోడానికి. ప్రచురించినవిపోగా యిప్పటికీ ప్రతి పత్రికాఫీసులోనూ కట్టలుపడి వుంటాయి...కావలిస్తే వెళ్ళి చూసుకోండి.

సామాన్య రచయితలలా ఒక్కోరచన వ్రాసి దానిని పోస్టులో వెయ్యాలంటే నాకు మహా చెడ్డ చికాకు. అందుకని నేనేం చేస్తానో తెలుసా! విసుగుపుట్టేంతవరకూ వ్రాయడం...వాటిని పార్శిల్సుగా కట్టి గూడ్సులో పంపేడం! ఇంతవరకూ ఏ రచయితయినా...పంపాడేమో వేలెత్తి చూపించండి!

ప్రపంచంలోవున్న కవులలోగాని, నటులలోగాని, చిత్రకారులలోగాని ఎన్నదగినవారంతా నా అభిమానసులు, ఎందుచేతంటే వాళ్ళు నాకంటె గొప్పవారు గనుక...

లుధారియో చాకలెట్లన్నా ప్యారీకంపెనీ పిప్పరమెంట్లన్నా తినడమంటే నా కమితమయిన ప్రీతి.

నేను కథకుడనంటే సామాన్య కథకుడివంటి దరిద్రుణ్ణికాదు, సిగరెట్లకొరకు ఖాళీజేబులు తడుముకోడానికి! నా పర్సు ఎప్పుడూ నిండు చూలాలిలా వుంటుంది. అందుకనే నాకు పుట్టే ఆలోచనలన్నీ అతి వున్నతాలు. అసలు నేను సిగరెట్లుకాల్చను. ఎవరైనా బలవంతపెడితే ఎప్పుడైనా కాల్చానా వెంటనే సబ్బుతో పెదిమలు శుభ్రపరచుకున్నానన్నమాటే! ఎందుకంటారా? సుకుమారమైన నా అధరాలు నల్లపడిపోవూ!

నాకున్న గొప్ప వూహా లేమిటంటారా? పెద్ద స్వీయచరిత్ర వ్రాసుకోవాలని వుంది నేను చేసిన గొప్ప పనులేవీ లేకపోయినా! ఏం? గొప్ప పనులు చేస్తేనే వ్రాసుకోవాలా? నాచేతిలో వుంది ఆయుధం...గిలికి పారేస్తాను. డబ్బుంది......ప్రింట్ చేయిస్తాను. ఇప్పుడు ప్రచురించబడిన నా పుస్తకాలన్నీ నేను ప్రింట్ చేయించుకున్న వేగా! ఏదో మన డిగ్నిటీకి లోపమని యితర్ల పేరేస్తూవుంటా !

నావి ప్రచురించబడిన పుస్తకాలు...“అతనికోసం,” “వలపు వల్లరి” “శోకగీతాలు,” “అనాథ.” ప్రచురణ కావలసినవి...“అడవిపూలు” “కలవరింతలు”......“కల్లోలాలూ” ఇంకా, ఇంకా యెన్నో...

నాకున్న రెండో వున్నతాశయ మేమంటే... నాకథ ‘అనాథ’ను ఫిల్ముతీయాలని. తీద్దామనుకుంటుండగానే యీ వెధవయుద్ధం ఒకటి అడ్డొచ్చిపడింది. లేకపోతేనా...

నేను ఫిల్మురంగంలో ప్రవేశించానంటే ఇప్పుడు పేరు ప్రఖ్యాతు లార్జించుకుంటూన్న కంపెనీలన్నీ నేలమట్టమయి పోవలసిందే! స్వంతగా స్టుడియో కట్టించాలి......అన్ని హోదాలూ నావే చేసుకోవాలి...ఏం! ఎందుకు చేసుకోకూడదూ?

కవిని, కథకుణ్ణి, గాయకుణ్ణి, చిత్రకారుణ్ణీ ఐన నేనే నటుడూ, డైరక్టరూ కథకుడూ మ్యూజికల్ డైరక్టరు ఆకు డైరక్టరుగా ఎందుకు కాకూడదూ? ఇన్ని కళలలో ప్రావీణ్యులైనవారెవరన్నా వున్నారా యిప్పటివరకూ? అంతేకూ కావలిస్తే నాకు అసిస్టెంటుగా మా “రాధ” ను నియమించుకుంటా...

ఇంతకీ ఏమిటో...మీకులేదు నా ఆర్టుచూచే అదృష్టం! ఫర్వాలేదు నిరుత్సాహ పడకండి... యుద్ధానంతర సమస్యల్లో యిదొకటి...అప్పటివరకూ ఎదురుచూడండి...

మరిచిపోయా, నేను పత్రికా ఎడిటరునుగూడానండోయి...అచ్చుపత్రికలు ప్రకటించ నిరాకరించిన నా రచనలతో ‘నవకళ’ అనే వ్రాత పత్రికను రెండు నెలలు నడిపాను...యిప్పటికైనా అంగీకరిస్తారా నేను గొప్పవాడినని...!

Published by M. S. Murthy at 12, Thambu Chetty Street, Madras and
Printed by B. Nagi Reddi at B. N. K. Press, 43, Acharappan Street, Madras.
*Joint Editors: V. KALIDAS & M. S. MURTHY.*